
సాక్షి
బాపట్ల

బుధవారం । 3 । జనవరి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,667 క్యూసెక్కులువదిలారు.



రేపటి నుంచి రోజ్ షో

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 4 నుంచి రోజ్ ఎగ్జిబిషన్, అగ్రి హార్టికల్చర్ షో నిర్వహించనున్నారు.



అపూర్వ నాట్యం

కూచిపూడి: అమెరికాకు చెందిన ప్రవాస భారతీయ కూచిపూడి నాట్యాచారిణి అపూర్వ చౌదరి ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలకు అపూర్వ స్పందన లభించింది.

న్యూస్‌రీల్

గుంటూరు తూర్పు సమన్వయకర్తగా ఫాతిమా



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా షేక్ నూరి ఫాతిమాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమాను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బీటెక్ పూర్తి చేశారు. ఆమె తండ్రి ఎమ్మెల్యే ముస్తఫా 2014, 2019లో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. రెండేళ్లుగా నూరి ఫాతిమా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శిగా కొంతకాలంగా ఆమె పనిచేస్తున్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ప్రతి డివిజన్‌లో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రత్యేక కృషి చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్తగా నూరిఫాతిమాను నియమించడంపై పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పరీక్ష పే చర్చ ప్రత్యేక డ్రైవ్

గుంటూరు ఎడ్యుకేషన్ : పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని మోదీ నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చా కార్యక్రమానికి విద్యార్థులను నమోదు చేసేందుకై బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, డైట్ ప్రిన్సిపాల్, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులందరు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పరీక్ష పే చర్చా కార్యక్రమ నమోదుకు పూర్తి సమయాన్ని కేటాయించాలని ఆమె ఆదేశించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో నమోదు చేయించడం అధికారుల విధుల్లో భాగమని, ఈ విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు 'చలో కలెక్టర్ కార్యాలయ ముట్టడి'కి అనుమతుల్లేవు

నగరంపాలెం: గుంటూరు జిల్లాలో బుధవారం అంగన్‌వాడీ మహిళలు తలపెట్టిన 'చలో కలెక్టర్ ఆఫీసు ముట్టడి'కి ఎటువంటి అనుమతుల్లేవని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈనెల 3న అంగన్‌వాడీ మహిళలు కలెక్టర్ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం విదితమే. దీన్ని ఆసరాగా చేసుకుని, అసాంఘిక శక్తులు శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ముట్టడికి అనుమతుల్లేవని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో 30(పోలీస్ యాక్ట్) అమల్లో ఉందని పేర్కొన్నారు. పోలీస్ ఆదేశాలను ఎవరైనా విస్మరించినట్లైతే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన శ్రీరామకోటి మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామక్షేత్ర ఆవరణలో 97వ శ్రీరామకోటి మహోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సుగంధ ద్రవ్యాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన అద్దాల మందిరంలో సీతారాముల పవళింపు సేవతో సుసంపన్నమైనాయి. పవళింపు సేవలో కె.మృణాళిని, మాధవికృష్ణ భక్తి రంజని నిర్వహించారు. శృంగేరి పీఠాధీశ్వరులు, జగద్గురువులు భారతి తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి స్వామి వారి దివ్యాశీస్సులతో నిర్వహించగా, రామనామక్షేత్ర గౌరవాధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్, ట్రస్టీస్ రాగం వెంకటలీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2500, గరిష్ట ధర రూ.3400, మోడల్ ధర రూ.3000 వరకు పలికింది.

పండుగ పింఛెన్

- జనవరి 8 వరకు పంపిణీ
- 25 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో కార్యక్రమాలు
- పాల్గొననున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పిట్టలవానిపాలెంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కొత్త ఏడాది వైఎస్సార్ పింఛన్ కానుకను ప్రభుత్వం పండుగలా పంపిణీ చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో జనవరి రెండో తేదీ నుంచి 8వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 25 మండలాల పరిధిలో 29 చోట్ల ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. పింఛన్‌దారులను నిర్దేశిత ప్రాంతాల్లో సమూహపరచి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఇలా..

పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం జనవరి 8వ తేదీ వరకు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 25 మండలాల పరిధిలో నాలుగు మున్సిపాలిటీలతో కలిపి 29 చోట్ల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం బాపట్ల నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం అద్దంకి అర్బన్, బాపట్ల మున్సిపాలిటీ, భట్టిప్రోలు, చినగంజాం, చీరాల మున్సిపాలిటీ, మార్టూరు, పర్చూరు, సంతమాగులూరు, వేమూరు, యద్దనపూడిలో, 4వ తేదీన బల్లికురవ, కర్లపాలెం, కొల్లూరు, నిజాంపట్నం, రేపల్లె మున్సిపాలిటీల్లో, 5న అద్దంకి, చెరుకుపల్లి, చీరాల, కారంచేడు, నగరం, చుండూరు, వేటపాలెంలో 6న అమృతలూరు, ఇంకొల్లు, కొరిశపాడులో, 8వ తేదీన జె.పంగులూరులో పింఛన్ల కార్యక్రమాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది.

అర్హులందరికీ పంపిణీ

జిల్లా వ్యాప్తంగా 2,33,836 మంది పింఛన్‌దారులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.68.98 కోట్లు పంపిణీ చేస్తోంది. గతంలో ఉన్న పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వం రూ.3 వేలకు పెంచింది. పెంచిన మొత్తాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి పండుగ వాతావరణంలో పంపిణీ చేస్తున్నాం. కార్యక్రమంలో అధికారులతోపాటు ప్రజాప్రతినిధులందరినీ భాగస్వాములను చేస్తున్నాం.
– బి.అర్జునరావు, పీడీ, డీఆర్‌డీఏ.

పిండమార్పిడి ప్రక్రియతో పెయ్యదూడ జననం

పల్నాడు జిల్లాలో ప్రప్రథమం



పెయ్యదూడతో పశుపోషకుడు కృష్ణ

క్రోసూరు: ఒంగోలు జాతికి చెందిన మేలు రకం పెయ్య దూడను పుట్టించడంలో గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన పశువైద్యులు విజయం సాధించారు. డాక్టర్ మల్లయ్య వివరాలు వెల్లడించారు. స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి చేసి ఈ పెయ్య దూడను పుట్టించినట్లు తెలిపారు. ఏపీ పశుసంవర్ధకశాఖ లాంఫారం, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పిండమార్పిడి ప్రక్రియ ద్వారా పెయ్యదూడ పుట్టించినట్లు చెప్పారు. క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామంలోని రైతు శ్రీరాంసెట్టి కృష్ణకు చెందిన నాటు ఆవు గర్భంలో మేలుజాతి ఒంగోలు జాతి పిండాన్ని గతేడాది మార్చి 1వ తేదీన ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డిసెంబర్ 30 తేదీన 2023న ఆరోగ్యవంతమైన ఒంగోలు జాతి పెయ్యదూడకు ఆవు జన్మనిచ్చిందన్నారు. అండం సేకరించడంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ, ఐవీఎఫ్, ఫలదీకరణ పిండాన్ని అభివృద్ధి చేయటంలో లాంఫారానికి చెందిన డాక్టర్ ఎన్ఆర్ శ్రీకాంత్ సేవలందించినట్లు వివరించారు. ఆవు గర్భంలో పిండాన్ని ప్రవేశపెట్టటానికి మండల పశువైద్యాధికారి మల్లయ్య సేవలందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్
- ఖాజీపాలెంలో వైద్య శిబిరం పరిశీలన
- ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



రోగితో మాట్లాడుతున్న కమిషనర్ జె.నివాస్

పిట్టలవానిపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఖాజీపాలెం గ్రామసచివాలయం వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. రోగులను వైద్యులు పరీక్షిస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆన్‌లైన్‌లో రోగి ఆరోగ్య పరమైన విషయాలను నమోదు చేసే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి విడత గతేడాది సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో కోటీ 45 లక్షల గృహాలను సందర్శించి 6 కోట్ల 50 లక్షల మందికి వైద్యసేవలు అందించినట్లు చెప్పారు. కంటి వెలుగు కింద 5 లక్షల 50 వేల మందికి కంటి అద్దాలు అందించామని తెలిపారు. లక్షా 64 వేల మందికి మెరుగైన వైద్యం అందించేందుకు రిఫర్ చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి రెండో విడత కార్యక్రమంలో వైద్యం చేయించుకున్న వారికి నేరుగా మందులు మీ ఇంటి వద్దకే అందిస్తామని తెలిపారు. ప్రతినెలా మీకు నెలకు సరిపడా మందులు మీ ఇంటి వద్దకు పోస్టు ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందించే మందుల పట్ల నమ్మకం ఉంచాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన మందులను ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ విజయమ్మ, డీఐఓ వెంకటేశ్వర్లు సిబ్బంది ఉన్నారు.

ప్రజలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం



పాత నందాయపాలెంలో మాట్లాడుతున్న కమిషనర్ జె.నివాస్

పాత నందాయపాలెం(కర్లపాలెం): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలందరికీ ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందజేస్తుందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామ సచివాలయం వద్ద జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కమిషనర్ సందర్శించారు. ఆరోగ్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ వైద్యం అందుబాటులో ఉండే విధంగా గ్రామ స్థాయిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. డీపీవో డి.రాంబాబు మాట్లాడుతూ మండలంలో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఆరోగ్య సమస్యలున్న వారు శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు, డీఎంహెచ్‌వో ఎస్.విజయమ్మ, డీఐవో డి.వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి.రవీందర్, తహసీల్దార్ కేశవనారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, డాక్టర్లు సుహానాబేగం, గోపీనాథ్, సునీత, సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జననీ.. దుర్గాభవానీ





చల్లంగ చూడమ్మా.. నమస్కరిస్తున్న భవానీలు

- నేటి ఉదయం 6.30 గంటలకు భవానీ దీక్షల విరమణ ప్రారంభం
- తమిళనాడు నుంచి శక్తి మాతలు రాక
- 6, 7 తేదీల్లో లక్షన్నరకు పైగా భవానీలు విచ్చేస్తారని అంచనా
- 7న మహా పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణకు దుర్గామల్లేశ్వరస్వామి సన్నిధిలో సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు దీక్షల విరమణ జరగనున్నాయి. మంగళవారం భవానీల రాకతో దుర్గమ్మ నామస్మరణతో ఇంద్రకీలాద్రి పరిసరాలు మార్మోగుతున్నాయి. దుర్గగుడిలో దుర్గమ్మ దర్శనం కోసం భవానీలకు 5 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువ నుంచి మూడు క్యూలైన్లు కొండపైకి ఏర్పాటు చేశారు. మార్గమధ్యంలో మరో క్యూలైన్ ఏర్పాటు చేశారు. మొత్తం నాలుగు క్యూలైన్లు ఆలయంలోకి చేరుకునే సరికి 5 లైన్లుగా మారతాయి. సర్వ దర్శనంలో రెండు, బంగారు వాకిలి, రూ. 300, రూ.100 క్యూలైన్ల ద్వారా భవానీలు అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక దర్శనం పూర్తైన తర్వాత సర్వ దర్శనం రెండు క్యూలైన్లు, రూ. 100 క్యూలైన్లను మల్లేశ్వరస్వామి ఆలయం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. రూ. 300 క్యూలైన్, బంగారు వాకిలి క్యూలైన్లను మహా మండపం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు చేరుకుంటారు. ఆలయ పరిసరాల్లో మొత్తం 220కి పైగా సీసీ కెమెరాలను, దుర్గాఘాట్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశారు. మహా మండపం ఎదుట ఏర్పాటు చేసిన హోమగుండాలోల అగ్ని ప్రతిష్టాపనతో ఉదయం 6.30 గంటలకు దీక్ష విరమణలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. సుమారు 5 లక్షల మంది భవానీలు విచ్చేస్తారని దేవస్థాన అధికారులు అంచనా వేస్తున్నారు. భవానీల కోసం నాలుగు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. .

ఒక రోజు ముందుగా శక్తిమాతలు

ఏటా దీక్ష విరమణలకు ఒక రోజు ముందుగా తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున శక్తి మాతలు ఇంద్రకీలాద్రికి చేరుకుంటారు. ఈ ఏడాది కూడా మంగళవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి సన్నిధికి చేరుకుంటున్నారు.

అత్యంత కీలకంగా ఆరో తేదీ

దీక్ష విరమణల్లో నాలుగోరోజు అత్యంత కీలకంగా దేవస్థానం, పోలీసు, రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. 6వ తేదీ సాయంత్రం నుంచి విజయవాడ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భవానీలు తరలివస్తారు. వీరితో పాటు నగరానికి చెందిన సాధారణ భక్తులూ భవానీలతో గిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. శనివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు నిరంతరం గిరి ప్రదక్షిణ జరుగుతూనే ఉంటుంది. రెండు రోజుల్లో లక్షన్నరమంది వస్తారని అధికారులు అంచనా. శనివారం రాత్రి 11 గంటల వరకు భవానీలను దర్శనానికి అనుమతించినా, ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచే దర్శనానికి దేవస్థానం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.

మహా పూర్ణాహుతితో ముగింపు

భవానీ దీక్షల విరమణ 7వ తేదీ ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో ముగుస్తాయి. ఆదివారం పెద్ద ఎత్తున భవానీలు వచ్చే అవకాశముంది.

వీఎంసీ సమీక్ష

పటమట(విజయవాడతూర్పు): దుర్గగుడిలో ఈ నెల 3వ తేదీ నుంచి జరగబోయే భవాని దీక్షల విరమణకు వచ్చే భక్తులకు నగరపాలక సంస్థ ఏర్పాట్లన్నీ పూర్తి చేసిందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మంగళవారం ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భక్తుల కోసం హోల్డింగ్ ఏరియా, బస్టాండ్, కెనాల్ రోడ్, పున్నమిఘాట్, భవాని ఘాట్, సీవీఆర్ ఫ్లై ఓవర్ కింద, ఇంద్రకీలాద్రి కొండకింద, కొండ పైన తదితర ప్రదేశాలలో తాత్కాలికంగా 200 మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఏర్పాటలను డీజీ విశాల్‌గున్ని మంగళవారం పరిశీలించారు.

దేశాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాం

- మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ కృషి
- 'సాగర్ పరిక్రమ'లో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల
- పర్యాటక కేంద్రంగా వాడరేవు: ఎమ్మెల్యే కరణం
- పాల్గొన్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి, మస్తాన్‌రావు
- అయోధ్య రామమందిర ఆహ్వాన పత్రికలు పంపిణీ



వాడరేవు సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే, ఎంపీలు, అధికారులు

చీరాల: మత్స్యకారుల సంక్షేమం కోసం కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తున్న ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కిందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. మంగళవారం మండలంలోని వాడరేవు తీరప్రాంతం ఒడ్డున 'సాగర్ పరిక్రమ-10' కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులతో ముఖాముఖీ, కిసాన్ క్రెడిట్ కార్డులు, సేఫ్టీ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రితోపాటుగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, మత్స్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్రమంత్రి రూపాల మాట్లాడుతూ భారత్‌లోని మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంగా పని చేస్తున్నాయన్నారు. అన్నదాతలకు ఉండే కిసాన్ క్రెడిట్ కార్డులను దేశంలోని మత్స్యకారులు అందరికీ వర్తింప చేసిన ఘనత పీఎం మోదీకే దక్కిందన్నారు. మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలపై దృష్టి పెడతామన్నారు. మత్స్యకారుల ముఖాముఖీలో వచ్చిన 1000 లీటర్ల డీజిల్ రాయితీ, బోట్లు, ఇంజిన్, వలలకు వేర్వేరుగా సబ్సిడీలు, ఒక్కో మత్స్యకారుడికి కేసీసీ రూ.లక్ష రుణం, 7 శాతం వడ్డీతో సకాలంలో చెల్లిస్తే 3 శాతం వడ్డీ మాఫీ చేసి కేవలం 4 శాతం వడ్డీకే రుణాలు అందించేందుకు బ్యాంకర్లు, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడుతున్నామన్నారు. అలానే ఈనెల 22న అయోధ్యలో జరిగే రామమందిరం ప్రారంభాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలందరూ దీపాలు వెలిగించి పండుగ చేసుకోవాలన్నారు. అయోధ్య రామమందిరం ఆహ్వానాలను ఎమ్మెల్యే కరణం బలరాంకు, ఎంపీలు మోపిదేవి, బీద మస్తాన్‌రావు, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావులకు కేంద్ర మంత్రి అందించారు. అనంతరం మత్స్యకారులకు కేసీసీ కార్డులు, సేఫ్టీ పరికరాలను కేంద్ర మంత్రి పంపిణీ చేశారు.

మత్స్యకారులతో ముఖాముఖీ..

తొలుత మత్స్యకారులతో నిర్వహించిన ముఖాముఖీలో మాజీ సర్పంచ్ రమణ, మత్స్యకార సొసైటీ నాయకులు శ్రీను మాట్లాడుతూ మత్స్యకారులకు ఇచ్చే 300 లీటర్ల సబ్సిడీ డీజిల్‌ను 1000 లీటర్లకు పెంచాలని, 75 శాతం సబ్సిడీతో వలలు, బోట్లు ప్రతి ఏడాదీ ఇవ్వాలన్నారు. గ్రామంలో మౌలిక వసతులు పెంచాలని, బోట్లకు, ఇంజిన్లు, ఇంజిన్ ఆయిల్‌కు సబ్సిడీ పెంచాలని అభ్యర్థించారు. దీనిపై మాజీమంత్రి, ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ గుజరాత్ తర్వాత అత్యధిక తీరప్రాంతం ఉంది ఏపీలోనేనని, మత్స్యశాఖ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. ఏపీలోనే అధికంగా సాంప్రదాయ మత్స్యకారులు ఉన్న వాడరేవు తీరానికి ఫిషింగ్ హార్బర్‌ను కేటాయించి సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారని, నిధులు కూడా ఉన్నాయని భూ సేకరణ పూర్తికావచ్చిందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే హార్బర్ పనులు ప్రారంభించి తద్వారా వాడరేవు అభివృద్ధి చెందుతుందన్నారు. మత్స్యకారులు, ఆక్వా రంగానికి చేయూతనిస్తున్నామన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక కృషి..

ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార రంగానికి అండగా నిలిచారన్నారు. రాష్ట్రంలో పది హార్బర్లను రూ.30793 కోట్లతో నిర్మిస్తున్నారని, హార్బర్ల ఏర్పాటుతో మత్స్యకారులు వృద్ధి చెందుతారన్నారు. మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, ఒడిశా, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల కంటే ఏపీలోనే అధికంగా మత్స్యకార రంగం అభివృద్ధి చెందిందన్నారు. 'సాగర్ పరిక్రమ' తడ నుంచి ఇచ్ఛాపురం వరకు ఈనెల 6 వరకు జరుగుతుందన్నారు.

హార్బర్‌తో ఉపాధి అవకాశాలు

ఎమ్మెల్యే కరణం బలరాం మాట్లాడుతూ వాడరేవు మత్స్యరంగంతోపాటుగా పర్యాటక రంగంలో కూడా ముందుందన్నారు. తీరం వెంబడి ఉన్న 14 కిలోమీటర్ల రోడ్డు ప్రత్యేక ఆకర్షణగా ఉందని మత్స్యకారుల సమస్యలు త్వరగా పరిష్కరించి వాడరేవును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం, పీఎం కృషి చేయాలన్నారు. మత్స్యకారుల జీవనశైలి, ఆర్థిక వృద్ధి చెందాలంటే సబ్సిడీ పథకాలు, రాయితీలు అందరికీ అందించాలన్నారు. హార్బర్‌తో వాడరేవులో ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ సెక్రటరీ నీతూ కుమారి, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, డైరెక్టర్ నియాతీ జోషి, వి.శ్రీనివాసరావు, ఆంటోనీ జేవియర్, డిప్యూటీ కమిషనర్ సంజయ్ ప్యాండీ, డీఎఫ్‌వో పి.సురేష్, డీఎస్పీ ప్రసాదరావు, ఏడీ కృష్ణకిషోర్, ఏపీఎం సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రూ.455 కోట్లతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం

- నిజాంపట్నంలో ఆక్వా పార్కు ఏర్పాటుకు అనుమతి
- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల

నిజాంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.455 కోట్లు వెచ్చించి నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తం రూపాల తెలిపారు. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం సాగర్ పరిక్రమ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల పాల్గొని మాట్లాడారు. భారతదేశం మొత్తంమీద నాలుగు ఆక్వా పార్కుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తే వాటిల్లో ఒకటి ఆంధ్ర రాష్ట్రంలోని నిజాంపట్నం అని తెలిపారు. పలు అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీనిచ్చారు. తొలుత ఆక్వా రైతు మోపిదేవి శ్రీనివాసరావుకు చెందిన చెరువులో పెరుగుతున్న వెనామీ రొయ్యలను కేంద్ర మంత్రి పరిశీలించారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలోని తీరప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు 10 ఫిషింగ్ హార్బర్‌ల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎంపీ నందిగం సురేష్ మాట్లాడారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరు గణేష్, జాయింట్ సెక్రటరీ నీతుకుమారి, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీగా నకిలీ-నిషేధిత సిగిరెట్స్ స్వాధీనం

విలువ రూ. 4.50 లక్షలకు పైమాటే!

నగరంపాలెం: గుంటూరు నగరంలో నకిలీ / నిషేధిత సిగిరెట్లను విక్రయించే ఓ వ్యక్తిని విజిలెన్స్ అధికారులు పట్టుకుని, రూ.4.50 లక్షలు విలువ చేసే సిగిరెట్లను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ / ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు నగర పరిధిలోని ఏలూరు బజార్ శ్రీబాలాజీ ట్రేడర్స్‌లో అక్రమంగా నకిలీ, నిషేధిత సిగరెట్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐటీసీ బ్రాండ్ మాదిరిగా నకిలీ సిగరెట్లు, అక్రమంగా తయారైన నిషేధిత ఇతర బ్రాండ్ సిగరెట్లను అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో నకిలీ గోల్డ్ ఫ్లాక్ లైట్ సిగిరెట్స్ 60 పాచేస్, నిషేధిత బ్రాండ్‌లైన పారిస్, గోల్డ్ స్టాగ్, ఎస్సే లైట్స్, ఎస్సే గోల్డ్, గోల్డ్ పౌడర్ సిగరెట్స్ బహిర్గతమయ్యాయి. దుకాణ డీలర్ గుడిపాటి చంద్రశేఖర్‌పై క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు చేపట్టారు.

కారు ఢీకొని మహిళ మృతి

రాజుపాలెం: అతివేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని దేవరంపాడు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. దేవరంపాడు గ్రామానికి చెందిన పిల్లల సరస్వతి (61), గజేంద్ర హనుమంతరావు, రుసుము సాంబ్రాజ్యం, కుంభా అంజియ్యలు కొండమోడు నుంచి స్వగామమైన దేవరంపాడుకు ఆటోలో బయలుదేరారు. వీరి ఆటో దేవరంపాడు క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరుగుతుండగా నరసరావుపేట నుంచి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. తీవ్రంగా దెబ్బలు తగిలిన సరస్వతిని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. గజేంద్ర హనుమంతరావుకు కూడా తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి


వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హనిమిరెడ్డి

బల్లికురవ: సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని వెలమవారిపాలెం పంచాయతీలోని కొత్తజమ్ముల మడక కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరించి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్లలా భావించి పాలన చేస్తూ దేశంలోనే నంబర్ వన్ సీఎంగా గుర్తింపు పొందారన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, ప్రాధాన్యత భవనాల పూర్తి, ఒకటో తేదీ తెల్లవారుజామున 5 గంటలకే నేరుగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందిస్తున్న ఘనత జగనన్నదేనన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం నూతన సంవత్సర కానుకగా పింఛన్ నగదు రూ.3 వేలు చేశారన్నారు. ప్రతి పక్షాలైన టీడీపీ, జనసేన ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న జగన్ మోహన్ రెడ్డిని రెండో సారి సీఎంగా చేయాలని ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు. తాను నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. అనంతరం కాలనీలోని చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. యాదవ కాలనీలోని నాగార్పమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, సర్పంచ్ నూనె ప్రభుదాస్, స్థానిక నేతలు కట్టా సుధాకర్, పుచ్చపు ఆంజనేయులు, నూనె దేవదాసు, రమేష్, జక్రయ్య, బైలడుగు కోటయ్య, నాగేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


చర్చిలో జరిగిన ప్రార్థనలో హనిమిరెడ్డి

ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్లపందెం పోటీలు

పోటీల్లో విజేతగా నిలిచిన బోయినవారిపాలెం ఎడ్లు

చీరాల టౌన్: మండలంలోని ఈపూరుపాలెం పంచాయతీ బోయినవారిపాలెం గ్రామంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల్లో బోయినవారిపాలెం ఎద్దుల జత ప్రథమ స్థానంలో నిలిచింది. మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన ఎద్దుల పందేలలో బోయినవారిపాలేనికి చెందిన ఎద్దుల ప్రథమ విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో ఈపురుపాలేనికి చెందిన దేవరపల్లి చంద్రరావుకు చెందిన ఎద్దులు, తృతీయ స్థానంలో ఈపురుపాలేనికే చెందిన బాల వెంకటేశ్వర్లు ఎద్దులు, నాలుగో స్థానంలో చినగంజాం సోపిరాలకు చెందిన వీరయ్య ఎడ్లు, ఐదో స్థానంలో వేటపాలేనికి చెందిన బి.కోటేశ్వరరావు ఎడ్లు , ఆరో స్థానంలో నెల్లూరుకు చెందిన సంతోష్ రెడ్డి ఎడ్లు విజేతలుగా నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ.15,116, మూడో బహుమతిగా రూ.10,116, నాలుగో బహుమతిగా రూ.7,116, ఐదో బహుమతిగా రూ. రూ.5,116, ఆరో బహుమతిగా రూ.3,116లను నిర్వాహకులు అందించారు. పోటీలను వీక్షించడానికి అధిక సంఖ్యలో పశుపోషకులు హాజరయ్యారు.

బాండీలో పడి ఉత్తరప్రదేశ్ వాసి మృతి

యద్దనపూడి: సబ్బుల తయారీకి ఉపయోగించే లిక్విడ్‌లో ప్రమాదవశాత్తు వ్యక్తి పడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం వంకాయలపాడు గ్రామ శివారున సబ్బుల తయారీకి అవసరమైన ముడి సరుకు తయారు చేసే ముఖేష్ కుమార్‌కు చెందిన దినేష్ పరిశ్రమ ఉంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులు 9 మంది సుమారు దశాబ్ద కాలంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ పనిచేసే కార్మికుడు అనిల్ (38) గతనెల డిసెంబర్ 28వ తేదీన ఉదయం 10.30 గంటలకు సబ్బుల తయారీకు ఉపయోగించే ముడిపదార్థం మరుగుతున్న పెద్దబాండీలో పడటంతో ఒళ్లంతా తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు గమనించి అదేరోజు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ నినాదం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్

చినగంజాం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని పెదగంజాం గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రాజుబంగారుపాలెం నుంచి పెదగంజాం వరకు జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన 2.5 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు ప్రారంభోత్సవంతో పాటు రైతులకు ఉచిత వ్యవసాయ కనెక్షన్లు అందించేందుకు సుమారు రూ.20 లక్షలతో పెదగంజాం నుంచి గొల్లపాలెం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైనును ఆయన ప్రారంభించారు. దీంతో పాటు చీరాల నుంచి పెదగంజాం వరకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ పీఆర్‌డీ దాసు, విద్యుత్ ఏఈ పీ గణనారాయణ, వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మున్నం నాగేశ్వర రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆమంచి వెంకట సుబ్బారావు, కొండూరి గోవింద్, ఎస్సీ సెల్ కన్వీనర్ పాదర్తి ప్రకాష్, బీసీ సెల్ కన్వీనర్ వీవీఆర్ ప్రసాద్, గొనసపూడి, సంతరావూరు సొసైటీల చైర్మన్‌లు మారెళ్ల రామకృష్ణ, కేవీ సుబ్బారావు చౌదరి, కొత్తపాలెం మాజీ సర్పంచ్ కేవీ రెడ్డి, మున్నం వారిపాలెం ఉప సర్పంచ్ బేతాళ మునిరత్నం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు విష్ణు నారాయణ, కొత్తగొల్లపాలెం గ్రామ నాయకులు, కాపులు, బొడ్డు జనార్ధనరెడ్డి, కోమట్ల శివారెడ్డి, కుక్కల వెంకట రమణారెడ్డి, దేవరకొండ శ్రీను,బలరాం, ఆసోది గోపి, పల్లపోలు లక్ష్మీనారాయణ, శిఖరం రామకృష్ణ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తున్న కృష్ణమోహన్

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

జిల్లా పశుసంవర్థక శాఖాధికారి హనుమంతరావు

చీరాల టౌన్: నాలుగు నెలలు నిండిన దూడలకు నులిపురుగుల నివారణ టీకాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని బాపట్ల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు సూచించారు. మంగళవారం మండలంలోని గవినివారిపాలెం పశువైద్యశాలలో 32వ విడత గాలికుంటు, వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యుడు టి.శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి హనుమంతరావు హాజరై గాలికుంటు, నులిపురుగుల నివారణ టీకాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఆదాయ వనరని, జీవాల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడం వలన పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు పశుపోషకులు ఆర్థికంగా వృద్ధి చెందుతారన్నారు. నాలుగు నెలలు నిండిన దూడల నుంచి అన్ని పశువులకు విధిగా నులిపురుగుల టీకాలను వేయించాలన్నారు. ఈనెల 31 వరకు జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో గాలికుంటు, నులిపురుగుల టీకాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పశుపోషకులు విధిగా తమ పశువులు, దూడలకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో చీరాల ఏడీహెచ్ డాక్టర్ చిట్టిబాబు, పశు పోషకులు, రైతులు ఉన్నారు.


సిబ్బందికి సూచనలందిస్తున్న జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి హనుమంతరావు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ గుర్తింపు


కోఆర్డినేటర్ డాక్టర్ పి.రవిని అభినందిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ: యూనివర్శిటీ ఆఫ్ ఇండోనేషియా ఆధ్వర్యంలో ప్రకటించిన యూ ఐ గ్రీన్ మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్జాతీయంగా 298 వ, జాతీయంగా 10 వ ర్యాంక్ ని సొంతం చేసుకుంది. మౌలిక సదుపాయాల కల్పన, ఎనర్జీ, స్మార్ట్ భవనాలు, పునరుత్పాదక శక్తి, వ్యర్థాల నిర్వాహణ- పునర్వినియోగం, నీటి పరిరక్షణ, రవాణా, విద్య, పరిశోధనాంశాలను పరిశీలించి ర్యాంక్‌లను విడుదల చేసింది. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ర్యాంకింగ్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రవిని అభినందిచారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య సంధ్య కోల్, ఐక్యూఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యనిధి ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్

గుంటూరు ఎడ్యుకేషన్: భవిష్యనిధి (ఈపీఎఫ్) ఖాతాదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ తెలిపారు. కృష్ణనగర్‌లోని ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో మంగళవారం పాత్రికేయులు, ఖాతాదారులతో ఆయన ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రాజేష్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారానికై ఖాతాదారులు నేరుగా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా పరిష్కరించుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ఈ-మెయిల్, ఎక్స్, కు-కు, వాట్సాప్ 94946 57469 వంటి ప్రచార సాధనాలు, గ్రీవెన్స్ సెల్ ద్వారా సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు ప్రతినెలా 15వ తేదీలోపు తమ వద్ద పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల వేతనాల నుంచి మినహాయించిన సొమ్ముతోపాటు తమ వాటా ధనాన్ని పీఎఫ్ కార్యాలయానికి జమ చేయాలన్నారు. దీనిలో ఎవరికి మినహాయింపు లేదన్నారు. చెల్లింపులు ఆలస్యమైతే 33 శాతం నుంచి వంద శాతం వరకు జరిమానా, 12 శాతం వడ్డీ వసూలు చేస్తామని, కొన్ని సందర్భాలలో శిక్షలు విధిస్తామని స్పష్టం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ జేఆర్ మాధవ శంకర్ మాట్లాడుతూ కనీసం 20 మంది సిబ్బంది పనిచేసే సంస్థలు పీఎఫ్ పరిధిలోకి వస్తాయని, నెలకు రూ. 15 వేలకు పైగా వేతనం పొందే కార్మికుడు, ఉద్యోగి బేసిక్, డీఏ మొత్తంపై యజమాని నుంచి వాటా పొందిన వారికి హయ్యర్ (అధిక) పెన్షన్ మార్గదర్శకాలు వర్తిస్తాయన్నారు. ఒకవేళ పెన్షనర్ అకాల మరణం చెందితే వారి జీవిత భాగస్వామికి జీవితాంతం కనీసం రూ.వెయ్యి రూపాయల పెన్షన్ లభిస్తుందని తెలిపారు. టెలికం జిల్లా సలహా కమిటీ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో పత్రికల్లో పనిచేస్తున్న 58 ఏళ్ల నిండిన వారు సత్వరమే పెన్షన్ పొందటానికి పీఎఫ్ సిబ్బంది సహకరించాలని కోరారు.

దొంగతనం ఎలా చేశారు?

నుదురుపాడులో వివరాలు సేకరించిన క్లూస్ టీం

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని గుంటూరు-నరసరావుపేట హైవే ప్రక్కనగల ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం మందాల శివరామికోటిరెడ్డి, అరుణ దంపతులు వారి బంధువులకు అనారోగ్యానికి గురికావడంతో కొద్దిరోజుల కిందట హైదరాబాద్ వెళ్లారు. కాగా గతనెల 30న సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళాలు పగులగొట్టి ఇంట్లో సుమారు రూ. 7 లక్షల రూపాయలు విలువైన బంగారం, వెండి, నగదు దొంగలించారు. లైట్లు వెలుగుతూ, తలుపులు తీసి ఉండటాన్ని గమనించిన ఇంటిప్రక్కన వారు ఫోన్‌ద్వారా తెలియజేయడంతో ఊరి నుంచి వచ్చిన అరుణ, శివరామిరెడ్డిలు ఫిరంగిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, క్లూస్ టీం సభ్యులు వచ్చి ఇంటి పరిసరాలు, సీసీ ఫుటేజ్, దగ్గరలోని టవర్‌కు సంబంధించిన సమాచారం సేకరించారు. పూర్తివివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. వారివెంట ఎస్ఐ చల్లా కిషోర్, రైటర్ దాసు, సుబానిలు ఉన్నారు.


పరిశీలిస్తున్న క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, క్లూస్‌టీం సభ్యులు

దొంగ వేబిల్లులతో ఇసుక అమ్మకాలకు అడ్డుకట్ట

కొల్లిపర: మండల సమీపంలోని కృష్ణానది నుంచి సోమ వారం రాత్రి దొంగ వే బిల్లులతో నాలుగు ఇసుక లారీలు, ఎటువంటి బిల్లులు లేకుండా ఒక ఇసుక లారీలను పట్టుకున్నట్లు తెనాలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎ.వి. చలం, స్థానిక ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మట్లాడుతూ జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కె.సుప్రజ ఆదేశాల మేరకు కొల్లిపర మండలంలో ఎస్ఐ ఆర్.రవీంద్ర రెడ్డితో కలసి ఇసుక అక్రమ రవాణ పై దాడులు నిర్వహించగా 150 టన్నుల ఐదు ఇసుక లారీలను అదుపులోకి తీసుకుని సదరు లారీ యజమాని, డ్రైవర్ పై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం ఉన్నత అధికారులను నివేదిక అందించినట్లు తెలిపారు.

డీజే పాటలతో సామాజికవర్గాల మధ్య కొట్లాట

కొత్త ఏడాది వేడుకల్లో వివాదం

కొల్లూరు : నూతన సంవత్సర వేడుకలలో భాగంగా డీజే పాటల విషయంలో చోటు చేసుకున్న స్వల్ప వివాదం చిలికి చిలికి గాలివానలా మారి ఇరు గ్రామాలకు చెందిన రెండు సామాజిక వర్గాల నడుమ కొట్లాటలకు దారి తీసిన సంఘటన మండలంలోని తోకలవారిపాలెం, కిష్కిందపాలెం గ్రామాలలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కిష్కిందపాలెంకు చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఆదివారం రాత్రి డీజే పాటలతో ఊరేగింపుగా సమీపంలోని తోకలవారిపాలెం గ్రామంలోకి వెళ్లారు. ఆ సమయంలో వారి సామాజిక వర్గానికి చెందిన పాటలను పెట్టడంతో తోకలవారిపాలెంకు చెందిన మాల సామాజిక వర్గంకు చెందిన వ్యక్తులు తమ గ్రామంలో ఆపాట పెట్టడానికి వీలు లేదని ఆక్షేపించడం వివాదానికి ఆజ్యం పోసింది. ఇరు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ కొట్లాట వరకు వెళ్లడంతో సమాచారం అందుకున్న కొల్లూరు పోలీసులు ఇరు వర్గాలకు సర్ది చెప్పడంతోపాటు, డీజే బాక్స్‌ల వాహనాన్ని స్వాధీనం చేసుకుని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇరు గ్రామాల నడుమ రేగిన వివాదం నివురుగప్పిన నిప్పులా మారిన తరుణంలో సోమవారం రాత్రి డీజే బాక్స్‌ల వాహనాన్ని తిరిగి కిష్కిందపాలెం గ్రామానికి చెందిన వారికి పోలీసులు అప్పగించారు. ఆసమయంలో ద్విచక్ర వాహనాలపై కిష్కిందపాలెం వెళుతున్న ఆగ్రామానికి చెందిన యువకులు తోకలవారిపాలెంలో ద్విచక్ర వాహనాలతో ప్రదర్శనలు జరిపి అంబేడ్కర్ విగ్రహం పైకి రాళ్లు రువ్వారు. దీనిని గమనించిన తోకలవారిపాలెంకు చెందిన వ్యక్తులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. అనంతరం మరో మారు ఇరు గ్రామాలకు చెందిన రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం చోటు చేసుకున్నట్లు సమాచారం అందడంతో కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తోకలవారిపాలెంకు చెందిన వ్యక్తులు తమపై కిష్కిందపాలెం వ్యక్తులు దాడికి దిగారని గ్రామంలో చెప్పడంతో భారీ సంఖ్యలో తోకలవారిపాలెంకు చెందిన ప్రజలతోపాటు, బయట గ్రామాలకు చెందిన వ్యక్తులు కిష్కిందపాలెంపైకి దాడికి వెళ్లారు. పోలీసులు ఇరు వర్గాలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించకపోవడంతో కిష్కిందపాలెంలో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లు, ఇనుప రాడ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పరిస్థితి చేయిదాటుతుండటంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో రేపల్లె, భట్టిప్రోలు, వేమూరు, అమృతలూరు పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితి విషమించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. రెండు గ్రామాలలో తిరిగి ఘర్షణలు జరగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి ఇరు గ్రామాల మధ్య రాకపోకలను కట్టడి చేశారు.


కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో పోలీసు పికెట్

కాపునాడు పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా వెంకట సత్యనారాయణ

నెహ్రూనగర్: కాపులందరూ ఐక్యంగా ఉండి కాపు జాతి హక్కులను, ప్రయోజనాలను కాపాడుకోవడానికి పార్టీలకు అతీతంగా పనిచేయాలని కాపునాడు జాతీయ అధ్యక్షులు గాళ్ళ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం రాత్రి అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రంలో కాపునాడు పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పోలిశెట్టి వెంకట సత్యనారాయణ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాపునాడు, గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షుడు మిర్యాల గోపి కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ గ్రామ గ్రామాలలో కాపు సోదరులను చైతన్యపరిచి తమ హక్కుల సాధన కోసం నిరంతరం పనిచేయాలని ఆయన కాపునాడు కార్యవర్గానికి సూచించారు. ఈ సందర్భంగా కాపునాడు పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పోలిశెట్టి వెంకట సత్యనారాయణ చేత ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రం అందజేశారు.


సత్యనారాయణకు నియామక పత్రం అందజేస్తున్న గాళ్ళ సుబ్రహ్మణ్యం

6న టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా సీనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక జరుగుతుందని జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ సెక్రటరీ పి. కోటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 6వ తేదీ ఎంపిక చేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. దీనికోసం ఎంట్రీ ఫీజు రూ. 100లు ఉంటుందన్నారు. ఎంపికైన వారు ఒంగోలులో 11, 12, 13 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.